క్లుప్తంగా

సకాలంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి

సంతనూతలపాడు: మండలంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ధరల బోర్డులు ఏర్పాటు చేసి సకాలంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి సూచించారు. సంతనూతలపాడులోని రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేమ్ బోర్డులో డీలర్ పేరుతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పొందపరచాలన్నారు. రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెలా ఉదయం ఏడు గంటలకు నిత్యావసర వస్తువులను కార్డుదారులకు అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రేషన్ కార్డులకు సంబంధించి వివరాలను సంబంధిత రేషన్ డీలర్లు కార్యాలయంలో తెలియజేయాలన్నారు. కార్డుదారులకు నిత్యవసర వస్తువులను సక్రమంగా అందజేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆదిలక్ష్మి హెచ్చరించారు.

పలువురు వాహనదారులకు జరిమానా



వాహనదారులకు జరిమానా విధిస్తున్న ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు: మండల పరిధిలో రాంగ్ రూట్లో ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులకు వెల్లంపల్లి చిన్న వంతెన వద్ద మద్దిపాడు ఎస్సై శివరామయ్య తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని కోరారు.

పాత కక్షలతో ఇరు వర్గాల ఘర్షణ

- ఒకరికి తీవ్ర గాయాలు

గిద్దలూరు రూరల్: పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి గడికోట గ్రామ పంచాయతీ దేవనగరం గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరసింహులు, అతని కుమారుడు శ్రీకాంత్ మద్యం బెల్టుషాపు నిర్వహిస్తుంటారు. నారాయణరెడ్డి మద్యం కొనుగోలు తాలూకా నగదు బాకీ విషయమై బుధవారం నరసింహులుతో వాగ్వివాదం చోటుచేసుకుంది. గతంలో వీరి మధ్య ఓ స్థలం విషయంలో ఘర్షణలు తలెత్తాయని సమాచారం. అయితే నారాయణరెడ్డికి మద్దతుగా మాట్లాడిన కోటేశ్వరరెడ్డిపై శ్రీకాంత్ కర్రతో దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గిద్దలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరస్పర ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి

మార్కాపురం టౌన్: బేస్తవారిపేట మండలం కలగట్ల గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మార్కాపురం మండలం భూపతిపల్లి గ్రామానికి చెందిన మల్లాపురం శ్రీను, మొండెం కాశయ్య కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం, రెండెకరాల భూమి కేటాయించి ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా వ్యవసాయకార్మిక సంఘం ఉపాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్య కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూలి పనుల కోసం వెళ్లి మృతి చెందడం బాధగా ఉందన్నారు. చనిపోయిన రెండు కుటుంబాల వారు నిరుపేదలని, వారితోపాటు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న బాలయ్య, నాగేశ్వరరావు కుటుంబాలను కూడా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలి

తర్లుపాడు: తర్లుపాడులోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి దాతలు సహకరించాలని సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు జగన్ బాబు కోరారు. హిందువులు చనిపోతే దహన సంస్కారాలు చేసేందుకు శ్మశానవాటికకు రహదారి కూడా లేదని, కర్మకాండలు చేసుకునేందుకు వీల్లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘంలోని పలువురు దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టామని, నిధుల లేమితో అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. మృతి చెందిన వారిని దహనం చేసే స్థలంలో శ్లాబ్, శ్మశానవాటిక కాంపౌండ్ పూర్తి చేయాల్సి ఉందని, దాతలు స్పందించి సహకరించాలని కోరారు.

తురిమెళ్లలో ఉచిత వైద్య శిబిరం

కంభం: శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని మండలంలోని తురిమెళ్ల గ్రామంలో శుక్రవారం శాంతిరామ్ హాస్పిటల్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా బలిజ సేవా సంఘం నాయకులు శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వైద్య బృందం రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లకు కార్యాలయాలు కరువు

- పేరుకే మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్‌లు
- బోర్డులు కూడా ఏర్పాటు చేయని అధికారులు
- దళితులకు రుణాల సంగతి సరేసరి
- మరిచిన రెగ్యులర్ అధికారుల నియామకం



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ఒంగోలు వన్‌టౌన్: మాల, మాదిగ, రెల్లి ఉపకుల కార్పొరేషన్‌లకు చైర్మన్‌లను నియమించిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాలయాలు కేటాయించడం మరిచింది. రాష్ట్ర స్థాయిలో మూడు కార్పొరేషన్‌లు ఉండగా జిల్లా స్థాయిలో ఎస్సీ కార్పొరేషన్ పేరుతో ఒకే సంస్థ ఉంది. దీంతో లబ్ధిదారులు, అధికారుల్లో అయోమయం ఏర్పడింది. మాల కార్పొరేషన్ చైర్మన్‌గా పెదపూడి విజయకుమార్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉండవల్లి శ్రీదేవి, రెల్లి కార్పొరేషన్ చైర్మన్‌గా ఇంత వరకూ ఎవరినీ నియమించలేదు. ఏ ఉప కులానికి ఏ స్కీం కేటాయిస్తారో కుడా తెలియని పరిస్థితి ఉంది. నిధులు కూడా కేటాయించలేదు. ఒక్కో కార్పొరేషన్‌కు ఈడీ, ఈఓ, ఏఈఓ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ తదితర 21 పోస్టులు ఉంటాయి. వీరు తమ పరిధిలో జిల్లా స్థాయిలో రుణాలు మంజూరుకు అర్హులను ఎంపిక చేయడం, రుణాలు మంజూరు చేయడం, రుణాలు రికవరీ చేయడం వంటివి చేస్తారు. కార్పొరేషన్‌ల పరిధిలో బ్యాంక్ లింకేజీ రుణాలు, బోర్లు, మోటార్లు, భూమి లేని వారికి భూమి కొనుగోలు పథకం, విద్యుత్ సర్వీస్ లైన్ చార్జీలు, ఆటోలు, కార్లు, డ్రైన్ క్లీనింగ్ యంత్రాలు, పవర్ ఆటోలు, భూమి అభివృద్ధి పథకం తదితర అభివృద్ధి పథకాలు ఉండేవి. గత ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం సందర్శకులతో కిటకిటలాడుతూ ఉండేది. సంబంధిత అధికారులు కూడా బిజీగా ఉండేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు గడుస్తున్నా ఒక్కటంటే ఒక్క ఎస్సీ రుణం కూడా లబ్ధిదారులకు మంజూరు కాలేదు. దీంతో అధికారులకు చేతినిండా కాకపోయినా చేతిలో అసలు పనేలేని పరిస్థితి నెలకొంది.

రుణాలు ఏవి?

గతంలో పేదలకు రుణ సదుపాయం, స్వయం ఉపాధికి వీలుగా చేయూత లభించేది. అర్హత కలిగిన పేదలకు రుణాలు, సబ్సిడీలు అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రుణాల ఊసే లేక పోవడంతో ఎస్సీ ఉప కులాలకు చెందిన వారు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో కుల వృత్తులు, చేతి వృత్తులు, ఆటోలు, కార్లు వంటి వాటిని అందించి తద్వారా జీవనోపాధులు కల్పించే వారు. బ్యాంకులతో సంబంధం లేకుండా ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కెఎఫ్‌డీసీ వంటి కేంద్ర నిధులతో రుణాలు ఇచ్చే పథకాలు ఉండేవి. వీటిని మూడు ఎస్సీ ఉప కులాలకు ఏ విధంగా పంచుతారో అనే విషయంలో కూడా స్పష్టత లేదు.

> **ఒక్క రుణం కూడా ఇవ్వలేదు:**
> ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇస్తామన్న ప్రభుత్వం 6 నెలలైనా ఇంత వరకూ ఒక్క రుణం కుడా మంజూరు చేయలేదు. ఎస్సీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేస్తామని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చి ఇప్పుడు మరిచారు. సబ్ ప్లాన్ పొడిగింపును అసెంబ్లీలో ప్రవేశ పెట్టి చట్టబద్ధం చేయలేదు. ఉప కులాల కార్పొరేషన్‌లకు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. ముగ్గురు ఈడీలను, ఇతర సిబ్బందిని నియమిస్తే ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేసిన వారవుతారు.
> – నీలం నాగేంద్రరావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు

వైభవంగా త్యాగరాజ సంగీతార్చన



గాయత్రీ మందిరంలో త్యాగరాజ సంకీర్తనలో మహిళలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు త్యాగరాజ సేవా సమితి ఆధ్వర్యంలో ఒంగోలు మంగమూరు డొంక గాయత్రి మందిరంలో త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాల సంగీత కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం గాయత్రి మందిరం నుంచి త్యాగరాజ సేవా సమితి త్యాగరాజ భక్త బృందం ఆధ్వర్యంలో సామూహికంగా పాల్గొన్న భక్తులు త్యాగరాజు సంకీర్తనలు పాడుతూ త్యాగరాజు పటంతో నగరోత్సవం చేశారు. నేలంబొట్ల సౌమ్య శిష్య బృందం ఆధ్వర్యంలో సాయంత్రం ఆరు గంటలకు శ్రీ త్యాగరాజ స్వామి వారి ఉంఛవృత్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, పిన్నంరాజు నరసింహారావు, తూములూరి రామ సుబ్రహ్మణ్యం, తూములూరి నాగలక్ష్మి, రాజేశ్వరరావు, కరవది సాయి శరణ్య పాల్గొన్నారు.

మందులతో కుష్టు నయం



జూమ్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు

- డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: కుష్టు వ్యాధిని గుర్తించి సకాలంలో చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన తన చాంబర్లో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలోపై వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి తిరిగి కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చెవులు, వీపు, ఎదలపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరిచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని, వేడి వస్తువులు గుర్తించలేక పోవడం, కాళ్ల చెప్పులు జారి పోవడం, కాలివేళ్లు వంకర పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ లక్షణాలు ఉన్నవారు తమ ఇంటికి వద్దకు వచ్చిన ఆరోగ్య కార్యకర్తలతో పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య కార్యకర్తల వద్ద ఎండీటీ మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. డీఎల్‌టీఓ డాక్టర్ సురేష్‌కుమార్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథి, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ రజిత మానస, మాస్ మీడియా జిల్లా అధికారి శ్రీనివాసులు, ఎపిడిమియాలజిస్ట్ విక్టర్ బాబు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

సంతనూతలపాడు:

మండలంలో పిల్లలకు సంబంధించి ఆధార్, జన్మదిన ధ్రువీకరణ పత్రాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయా సచివాలయలలో ప్రత్యేక క్యాంపుల ద్వారా వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బర్త్ సర్టిఫికెట్ లేని వారికి నాన్ అవైలబులిటీ సమాచారం ద్వారా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సమన్వయంతో ఆ సమాచారాన్ని లాగిన్లో అప్లోడ్ చేయాలన్నారు. మిస్సింగ్ సిటిజన్, పీఏసీఎస్, టు హౌస్ జియో క్యాప్సరింగ్ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఐసీడీఎస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో ఆధార్, బర్త్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారం .. అనగా ఈ నెల 18వ తేదీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలని కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతిబాయ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

సంతనూతలపాడు: మండలంలోని చలప్పపాలెం గ్రామానికి చెందిన కరిచేటి రమేష్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2,23,429 చెక్కును ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ అందజేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న ఏడీఏ రమేష్‌బాబు

కొత్తపట్నం: ఎరువులు, పురుగు మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ ఏడీఏ బి.రమేష్‌బాబు డీలర్లను ఆదేశించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఎరువుల డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ ఆధారంగా రైతులకు ఎటువంటి ఎరువులు, పురుగు మందులు కావాలో గమనించి ఎరువులు షాపుల్లో ఉంచాలన్నారు. నిర్దేశించిన ధరలకు (ఎంఆర్‌పీ) ఇవ్వాలని కోరారు. ఆ విధంగా ఇవ్వని షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి షాపులో ధరల పట్టికను బయట తగిలించాలన్నారు. రైతు కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగు మందులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. రైతులు కూడా మీరు కొన్న ఎరువులకు రసీదు అడిగి తీసుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఇన్‌చార్జి ఏఓ సీహెచ్ అజయ్, టి.శ్రీనివాసరావు, ఎస్‌కే హైదర్ కరిముల్లా, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

సంతనూతలపాడు:



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

మండలంలోని సంతనూతలపాడు-1, పి.తక్కెళ్లపాడు గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సంతనూతలపాడులో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు పాల్గొని రైతులతో మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద గుర్తించబడిన ఆరు రకాల పంటలైన శనగ, మినుము, జొన్న, మొక్కజొన్న, ఎండు మిరప, వరికి ఇన్సూరెన్స్ చేయించుకున్న ప్రతి ఒక్క రైతు ప్రస్తుత రబీ సీజన్లో ప్రీమియం చెల్లించి అదే పంటను ఈ–పంటలో నమోదు చేయించుకుని ఈకేవైసీ చేయించుకుంటేనే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ పంటల్లో వచ్చే చీడపీడల ఉధృతి ఎన్‌పీఎస్ఎస్ యాప్‌లో నమోదు చేస్తూ రైతులకు తగిన సలహాలు, సూచనలు చేసి నివారణ చర్యలు తెలియజేయాలని ఆదేశించారు. సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి.పావని రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సంతనూతలపాడు యూనిట్ ఇన్‌చార్జ్ పి.శేషమ్మ, సిబ్బంది ఎన్.నాగలక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కె.వి.సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ.దుర్గాప్రసాద్, షేక్ అబ్జల్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో కార్యసిద్ధి వినాయకుడు

ఒంగోలు మెట్రో: పుష్య మాసం శుక్రవారం గణపతికి ప్రీతికరమైన సంకటహర చతుర్థి వేడుకలు నగరంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక కర్నూలు రోడ్డు పాలకేంద్రం దగ్గరున్న సిద్ధి బుద్ధి విఘ్నేశ్వరునికి, మణికంఠ నగర్లోని కార్యసిద్ధి గణపతికి దేవస్థానం, నెల్లూరు బస్టాండ్ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, అద్దంకి బస్టాండ్ వినాయకుని దేవస్థానం, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లోని గణపతి దేవస్థానం, సీతారాంపురంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, రాజాపానగల్ రోడ్లోని బుద్ధి సమేత విఘ్నేశ్వరుడికి, నగరంలోని వివిధ గణపతి ఆలయాల్లో ఆలయ అర్చకులు ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ గావించి అష్టోత్తర శత నామావళి పూజ క్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



త్యాగరాజస్వామి గ్రామోత్సవం

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్ కాలనీలో త్యాగరాజ స్వామి ఆలయంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఉంచి ఆలయం వద్ద నుంచి బస్టాండ్, సోమవారిపేట వరకు గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని నాయీబ్రాహ్మణులు వాయిద్యాలు, సంకీర్తనలతో కనుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు. మండలంలోని నాయీ బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయం వద్ద పూజలు చేస్తున్న నాయీబ్రాహ్మణులు


రేపు ఒంగోలులో మెగా మ్యూజికల్ నైట్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: నగరంలో ప్రముఖ గాయనీ, గాయకులతో ఆదివారం మెగా మ్యూజికల్ నైట్ జరుగబోతోంది. ఆ రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి స్థానిక హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న హైదరీ క్లబ్‌లో గంధర్వ గాన తరంగిణి పేరుతో నిర్వహించబోయే మెగా మ్యూజికల్ నైట్లో గాయకులు రాము, బాల కామేశ్వరరావు, గాయత్రీ నారాయణన్, నాదప్రియ తదితరులు పాల్గొననున్నారు. సంచలన నవయువ వాయిద్య బృందం, తెలుగు ఐడల్ ఫేమ్, సాయి పవన్ బ్యాండ్ వాయిద్య సహకారాన్ని అందజేస్తుండగా బహుబాషా ప్రవీణ, వ్యాఖ్యాన బ్రహ్మగా పేరొందిన మోహన్ గాంధీ కార్యక్రమానికి వ్యాఖ్యానాన్ని అందించనున్నారు. శుక్రవారం స్థానిక హైదరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నిర్వాహకులు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఒంగోలు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఒక సుమధుర సంగీత కార్యక్రమాన్ని అందించాలనే లక్ష్యంతో గంధర్వ గాన తరంగిణి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. దాదాపు 12 రకాల వాయిద్యాలతో సంగీత బృందం వాద్య సహకారాన్ని అందజేయనుంది. తెలుగు ఐడల్ ఫేమ్, ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు కామాక్షి కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా పాల్గొంటున్నట్లు చెప్పారు.

వయోజన విద్య వలంటరీ టీచర్లకు శిక్షణ



నిరక్షరాస్యులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న వెలుగు సిబ్బంది

చీమకుర్తి రూరల్: స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై శుక్రవారం వలంటరీ టీచర్లకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. చీమకుర్తి మండల పరిషత్ ఏవో వి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఉమ్మడి పర్యవేక్షకుడు టి.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయడమే ఈ ఉల్లాస కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వయోజనులకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ ఆర్థిక సాంకేతిక విషయాలలో పరిజ్ఞానం కోసం అక్షరాస్యులుగా తయారు చేయడమే ఈ ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. వెలుగు ఏపీఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఒక్కొక్క వలంటరీ టీచర్‌కు పదిమంది వయోజనుల చొప్పున విద్య నేర్పేందుకు మ్యాచింగ్, బ్యాచింగ్ చేయడం జరిగిందన్నారు. వయోజనులకు వారు చదువు చెప్పే బాధ్యత తీసుకోవటం జరిగిందని తెలిపారు. ఉపసంచాలకులు పి.వెంకటేశ్వరరావు వయోజనులకు విద్య నేర్చుకునే పరికరాల నిమిత్తం ఒక వ్యక్తికి రూ.400 ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీసీలు, వలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

ఆదాయం తెస్తున్న ఉద్యోగులను ఆదర్శంగా తీసుకోవాలి

మార్కాపురం: ఆర్టీసీకి ఆదాయం తెస్తున్న ఉద్యోగులను మిగిలినవారు ఆదర్శంగా తీసుకొని ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు సూచించారు. శుక్రవారం డిపోలో నిర్వహించిన సమావేశంలో డీఎం మాట్లాడారు. ఇటీవల మార్కాపురం ఆర్టీసీ డిపోకు అత్యధికంగా ఆదాయం తెచ్చిన కండక్టర్లు ఎస్.రాములు, టి వెంకటేశ్వర్లు, టీవీఎస్ రావు, జె.శ్రీనివాసులు, ఆర్‌సీహెచ్ పాపయ్య, ఎంఎస్ శ్రీనివాసులు, డ్రైవర్లు వైవీ కాశయ్య, ఆర్ఎమ్ నాయకులను నగదు బహుమతులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ అధ్యక్షుడు కాశయ్య, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.